క్లుప్తంగా

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా గోపి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా విజయవాడ నగరానికి చెందిన యాగంటి వెంకట గోపి ఎన్నికయ్యారు. గోరఖ్‌పూర్‌లో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ఏబీవీపీ 70వ జాతీయ మహాసభల్లో ఈ ఎన్నిక జరిగిందని వెంకట గోపి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏబీవీపీ విజయవాడ నగర కార్యదర్శిగా, ఏబీవీపీ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్‌గా విద్యార్థుల సమస్యలపై ఎన్నో ఉద్యమాలు నిర్వహించానన్నారు. పరిషత్ రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రటరీ విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న తనకు పరిషత్ జాతీయ కమిటీలో బాధ్యతలు అప్పగించినందుకు కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న హరికథ గానం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన గుడిపాటి జయరామ సుధాకర్ భక్త మార్కండేయుడనే అంశంపై హరికథా గానం చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై గుడిపాటి జయరామ సుధాకర్ మార్కండేయుడి గురించి హరికథ రూపంలో చక్కటి వ్యాఖ్యానంతో వివరించారు. సుధాకర్‌కు మృదంగంపై చావలి కృష్ణ మోహన్, వయోలిన్‌పై శ్రీనివాస్ చక్కటి సహకారం అందించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగిన హరికథను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం సుధాకర్ బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి డీఈవో రత్నరాజు ప్రసాదాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రామరాజ్య నగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా సబ్ స్టేషన్ పరిధిలోగల 11 కేవీ కామకోటినగర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు జోజినగర్, లక్ష్మీనగర్ కాలనీ, చర్చి రోడ్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, టీవీ కృష్ణారావు వీధి, ఆర్‌కే పబ్లిక్ స్కూల్ ఏరియా, మానవ మందిరం రోడ్, కోళ్లఫారం రోడ్ తదితర ఏరియాల్లో కరెంట్ నిలిపివేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మెట్లు, డ్రెయిన్లకు శంకుస్థాపన

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోగల నాలుగు స్తంభాల సెంటర్‌లోని వడ్డెరవారి వీధి కొండ ప్రాంతంలో రూ.5 లక్షల వ్యయంతో మెట్లు, డ్రెయిన్లు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి సోమవారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మైలవరపు దుర్గారావు, స్థానిక పెద్దలు వీరంకి సత్యనారాయణ, వల్లపు రాము, బడుగు గణేష్, గుంజా నాగరాజు, సచివాలయం సెక్రటరీ హర్షిత తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వేల్పూరి వెంకట సూర్య కుటుంబ సభ్యులతో కలిసి మల్లికార్జునపేటలో నివసిస్తున్నాడు. వెంకటసూర్య స్థానికంగా ఉన్న ఒక దుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి పురుషోత్తమ పట్నం వెళ్లి తిరిగి తన ఇంటికి వెళ్తుండగా మల్లికార్జునపేటలోని తన ఇంటికి దగ్గరలో ముద్రబోయిన నాగరాజు, పేటేటి మహీధర్ అనే వ్యక్తులు తనతో ఘర్షణకు దిగి కత్తితో, బీరు బాటిల్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దాంతో కిందపడిపోయిన వెంకటసూర్యను చూసిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. వారు అక్కడకు చేరుకొని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ స్థానికంగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెల మీద గుదిబండ

- ప్రమాదకరంగా సొరంగ మార్గం
- జారుతున్న కొండరాళ్లు
- ఐరన్ మెస్ ఏర్పాటు చేయాలని డిమాండ్



సొరంగం రెండో వైపున ఏర్పాటు చేసిన ఐరన్ మెస్



చిట్టినగర్ సొరంగం మార్గం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బంగాళాఖాతంలో వాయుగుండంతో ఒకటి రెండు రోజులు వర్షాలు కురుస్తాయనే హెచ్చరికలతో కొండ ప్రాంతవాసుల్లో భయాందోళనలు వ్యక్తం అవుతుంటాయి. ఎడతెరిపి లేని వర్షాలు, తుపాను ప్రభావంతో కొద్ది రోజుల పాటు వర్షాలు కురుస్తాయనే మాట వింటే చాలు సొరంగం కొండ ప్రాంతంలోని నివాసితులకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. సాధారణంగా వర్షాకాలంలో కురిసే వానలకు కొండ ప్రాంతాల్లో మట్టి జారి కొండ రాళ్లు విరిగి పడుతుంటాయి. ఇటీవల వరుసగా వస్తున్న తుఫానులతో కొండ ప్రాంతాల్లో ఎప్పుడు ఏ రాయి, ఏ కొండ చరియ విరిగి పడుతుందోనని భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. చిట్టినగర్ సొరంగం వద్ద తరుచూ కొండ రాళ్లు జారి పడి అటు వాహన చోదకులతో పాటు ఇటు స్థానికులు గాయాల పాలవుతున్న ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. కొండ రాళ్లు జారిపడకుండా 44వ డివిజన్ పరిధిలోని సొరంగం ప్రాంతంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐరన్ మెస్ ఏర్పాటు పనులను చేపట్టింది. సితార జంక్షన్ నుంచి సొరంగంలోకి ప్రవేశించే మార్గానికి ఇరు వైపులా రూ.89.96 లక్షల వ్యయంతో మెస్‌ను ఏర్పాటు చేయించడంతో ఆ మార్గంలో ప్రమాదాలు తప్పాయి. అదే తరహాలో 48వ డివిజన్ పరిధిలోని సొరంగం వద్ద కూడా ఐరన్ మెస్ ఏర్పాటు చేయిస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉంటామని వాహన చోదకులు పేర్కొంటున్నారు.

ఏడాదిలో ఐదు, ఆరు సార్లు...



జారిపడిన కొండచరియలు

సొరంగానికి ఇరు వైపుల పదుల సంఖ్యలో ఇళ్లు నిర్మించుకోవడం ద్వారా అనేక మంది పేదలు నివాసం ఉంటున్నారు. గత ఏడాది కాలంలో కొండపై నుంచి ఐదు, ఆరు సార్లు రాళ్లు జారి ఇళ్ల పైకి పడ్డాయి. తాజాగా ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో మూడో రోజున కొండపై నుంచి పెద్ద రాయి జారిపడటంతో పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతినగా, ఎవరికి ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. ఆస్తి నష్టం జరిగినా ప్రాణాపాయం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగి సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి పరామర్శించడం మినహా తమకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం వందలాది వాహనాల రాకపోకలు....

చిట్టినగర్ సొరంగం మార్గం ద్వారా ప్రతి నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన వారు భవానీపురం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం వైపు వెళ్లాలంటే సొరంగ మార్గమే ఆధారం. వీటికి తోడు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇక మినీ లారీలు, స్కూల్ బస్సులకు కొదవే ఉండదు. ఒక రోజు సొరంగం మూసివేశారంటే ఆ ప్రభావం అటు కుమ్మరిపాలెంతో పాటు ఇటు పాలప్రాజెక్టు ఫ్లైఓవర్‌పై తీవ్రంగా కనిపిస్తుంది. అంతటి ప్రాముఖ్యత ఉన్న సొరంగం వద్ద కొండ రాళ్లు జారిపడకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని పశ్చిమ నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

భారీగా నీటి లీకేజీలు....

సొరంగం మధ్యలో గత కొద్ది నెలలుగా భారీగా నీరు లీకేజీ అవుతుంది. కొండ ప్రాంతంలోని ఇళ్లలో వాడుకున్న నీరు లోపలకు ఇంకి నీటిధారలుగా వస్తుంది. గతంలో కొద్ది కొద్దిగా కనిపించే నీటి ఊట ఇటీవల పెద్ద ధారలా మారింది. నీటి ఊట పడిన ప్రాంతంలో నాచుపట్టి వాహనాలు జారి పడుతున్నాయి. దీంతో సొరంగంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



వర్షాలు, తుపానులతో సంబంధం లేకుండా కొండ రాళ్లు జారిపడుతున్నాయి. ఎప్పుడు ఏ రాయి ఏ ఇంటిమీద పడుతుందోనని 20కి పైగా కుటుంబాలు బిక్కుబిక్కుమంటున్నాయి. కొండ చరియలు విరిగి పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నాం.

– హబీదా

నష్ట పరిహారం ఇవ్వాలి



దసరా సమయంలో కొండ రాళ్లు జారిపడి 8 కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అందులో నాలుగు కుటుంబాలకే న్యాయం జరిగింది. కనీసం ఇంటి మరమ్మతులు చేయించుకోవాలన్నా అప్పులు చేసుకోవాల్సిన పరిస్థితి. నష్టపోయిన బాధితులందరికి పరిహారం అందించాలని కోరుతున్నాం.

– మీరాబీ

ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరగాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



చిట్టినగర్‌లో ఫిర్యాదును స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ అందించే మౌలిక సదుపాయాల కల్పనలో ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, పరిష్కరించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదులు – పరిష్కర కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

సమస్యలపై 13 ఫిర్యాదులు..

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును అధికారులు స్వయంగా, ఫిర్యాదు చేసిన వారి వద్దకు వెళ్లి పరిశీలించి, సమస్యకు పరిష్కారం చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదులను ఆయన స్వీకరిస్తూ, అక్కడున్న అధికారులతో సర్కిల్ – 1 పరిధిలో ఉన్న సమస్యల గురించి చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సర్కిల్ 2, 3, కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న ఫిర్యాదుల స్వీకరణను పరిశీలించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సర్కిల్–1 కార్యాలయంలో రెండు ఫిర్యాదులు, కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో 11 ఫిర్యాదులు అందాయి. వాటిలో ప్రధానంగా ఇంటి పన్నులు, డోర్ నెంబర్ కరెక్షన్స్, అనధికార కట్టడాలు, ఆక్రమణలు, తాగునీటి సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. సర్కిల్ –1 కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్‌తో పాటు జోనల్ కమిషనర్–1 రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్ రెడ్డి, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ హెలెన్, శానిటరీ సూపర్‌వైజర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

కూటమి హామీలు నెరవేర్చాలి



కేదారేశ్వరపేటలో దరఖాస్తులు నమోదు చేస్తున్న సీపీఐ నాయకులు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు బుట్టి రాయప్ప డిమాండ్ చేశారు. పేదలకు రెండు సెంట్ల నివాస స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో భాగంగా సోమవారం 34వ డివిజన్ కేదారేశ్వరపేటలోని సీపీఐ కార్యలయం వద్ద దరఖాస్తు నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమ వాగ్దానాన్ని సత్వరమే అమలు చేయాలని కోరారు. జాప్యం జరిగే కొద్ది ఇచ్చిన హామీలు అటకెక్కుతాయనే భయం ప్రజల్లో అప్పుడే మొదలైందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దొడ్డ కుమార్, కాళ్ళ విజయ్, వెలంగినమ్మ, మారయ్య, సైదులు పాల్గొన్నారు.

ఆకుల శ్రీనివాస్‌కు పలువురి పరామర్శలు



ఆకులను పరామర్శిస్తున్న దేవినేని అవినాష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు, కాపు నేత ఆకుల శ్రీనివాస్ కుమార్‌ను పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పరామర్శించారు. ఆకుల శ్రీనివాస్ కుమార్ చిన్న కుమారుడు డాక్టర్ రాజ్‌కుమార్ ఆదివారం మరణించిన సంగతి తెలిసిందే. విషయం తెలిసిన వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, మాజీ మంత్రి, మైలవరం ఇన్‌చార్జ్ జోగి రమేష్, జగ్గయ్యపేట ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి సోమవారం భవానీపురంలోని ఆకుల నివాసానికి వచ్చి పరామర్శించారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తూ మనో ధైర్యాన్ని కల్పించారు. ఆకుల శ్రీనివాస్ కుమార్‌ను పరామర్శించిన వారిలో మాజీ శాసన సభ్యులు సామినేని ఉదయభాను, లింగంశెట్టి ఈశ్వరరావు, నాయకులు వంగవీటి శంతన్‌కుమార్ తదితరులు ఉన్నారు. ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెలంపల్లి శ్రీనివాస్ ఫోన్ ద్వారా పరామర్శించారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

- కార్తికమాసం చివరి సోమవారం కావటంతో భారీగా హాజరైన భక్తులు
- కార్తిక దీపాలతో కళకళలాడిన ఆలయాలు



పాతశివాలయంలో కామేశ్వరిదేవి



మల్లేశ్వరునికి విశేష అలంకారం



స్వామి వారికి విశేష అలంకరణ



వన్‌టౌన్ పాత శివాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పవిత్రమైన కార్తిక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని పలు శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. పరమశివుడిని తలచుకుంటూ భక్తులు చేసిన హరనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తెల్లవారుజాము నుంచి శివాలయాలన్నింటిలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా స్వామి వారికి మహాన్యస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లింగార్చన నిర్వహించారు. వన్‌టౌన్ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నక్త దీక్షా మహోత్సవాలను పురస్కరించుకొని స్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, దశశాంతులు, సహస్రనామార్చనలు నిర్వహించారు. భ్రమరాంబ అమ్మవారు కామేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉపవాసాలను పాటించి ఆలయాలకు చేరుకున్నారు. విజయేశ్వరస్వామి వారి దేవస్థానం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భక్తులతో కిటకిటలాడింది. కొత్తపేటలోని గంగా పార్వతీ సమేత ధర్మేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు మురళీ ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. పాతబస్తీలోని శ్రీ కన్యకా నగరేశ్వర, కోదండ రామాలయం (కొత్తగుళ్ళు) ఆవరణలో కొలువై ఉన్న నగరేశ్వరస్వామి వారి దేవస్థానానికి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. రుద్ర హోమంతో పాటుగా సహస్రలింగార్చన చేశారు. గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో పరమశివునికి సోమవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సహస్రనామార్చన, ప్రత్యేక అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. రామ్‌గోపాల్ సత్రం ప్రాంగణంలో కొలువై ఉన్న కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో కొలువైఉన్న ఆంజనేయస్వామివారికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాల్లో విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారికి తెల్లవారుజాము నుంచి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ జరిగింది. స్వామి వారికి ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద కార్తిక దీపారాధనలు నిర్వహించారు. శివనామ స్మరణతో ఆలయాలన్నీ మార్మోగాయి. సాయంత్రం ఆకాశ దీపం వెలిగించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి 11 ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమానికి స్థానిక పెద్దలు వెన్నం రజనీ కుమార్, కూరాకుల నాగలతో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు. చిట్టినగర్‌లోని కొత్త అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలోని శివాలయంలో స్వామి వారికి తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, పూజలు జరిపించుకునేందుకు విచ్చేసిన భక్తుల క్యూ ఆలయం వెలుపలకు చేరింది. సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపోత్సవ సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాద్ శర్మ, కాశీ విశ్వనాథ్ పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి సన్నిధిలో సహస్ర దీపార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి సన్నిధిలో విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేషంగా అలంకరించారు. సాయంత్రం ఆరున్నర గంటలకు మల్లేశ్వర స్వామి వారికి మహా నివేదన, పంచహారతుల సేవ జరిగింది. ఉత్సవ మూర్తులకు సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ నిర్వహించగా, ఆలయ డీఈవో రత్నరాజు సేవలో పాల్గొన్నారు.



వన్‌టౌన్ పాత శివాలయం క్యూలో భక్తులు



కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్‌లో అభిషేకాలు



విజయదుర్గా రామలింగేశ్వర స్వామికి చందనంలో అభిషేకం



దీపార్చనలో ఆలయ డీఈవో రత్నరాజు



భీమన వారి పేటలో అన్న ప్రసాద వితరణ

గొల్లపూడి–జక్కంపూడి రైల్వే ఎల్‌సీ గేటు మూసివేత

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా గొల్లపూడి–జక్కంపూడి మధ్య రైల్వే ఎల్‌సీ గేటు నెంబర్ 150ని తాత్కాలింగా మూసివేయనున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఒక ప్రకటలో తెలిపారు. ఈ నెల 27 ఉదయం 8 గంటల నుంచి 28వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఎల్‌సీ గేటును మూసివేయనున్నారు. ఆ మార్గంలో రోడ్డు మార్గం ద్వారా రాకపోకలు సాగించే వాహనదారులు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా ముగిసిన భోగ శ్రీనివాసమూర్తి సంప్రోక్షణ



పూర్ణాహుతి నిర్వహిస్తున్న రుత్వికులు

విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపం ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భోగశ్రీనివాసుని సంప్రోక్షణ కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. భక్తులు గోవిందనామాలు ప్రతిధ్వనిస్తూ ఉండగా వేద పండితులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. మహాపూర్ణాహుతి యాత్రదానం వరకు జరిగే వైదిక క్రతువు, కళావాహన, అక్షతారోహణ, బ్రహ్మఘోష తదితర కార్యక్రమాలను తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ శాస్త్ర పండితులు నల్లూరి మోహన వెంకట రంగాచార్యులు, కామకన భట్టార్, ఆర్ బీఎంకేఎస్ అయ్యన్న, సూర్యకుమారా చార్యులు నిర్వహించారు. అర్చకులను దేవాలయం అధికారులు ఘనంగా సత్కరించారు. టీటీడీ దేవస్థాన ఇన్‌స్పెక్టర్ సీహెచ్ లలితా రమాదేవి పర్యవేక్షించారు.

• పరమ పవిత్రం.. కార్తికం



పరమ పవిత్రమైన కార్తికమాసం నాల్గో సోమవారం సందర్భంగా విజయవాడ దుర్గఘాట్ వద్ద కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఘాట్‌కు తరలివచ్చారు. నదిలో స్నానాలు చేసి కార్తికదీపాలు వదిలారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







ఆచంట సేవలు ఆదర్శనీయం



వెంకటరత్నం నాయుడు వర్ధంతిలో హరగోపాల్, గోళ్ళ నారాయణరావు, రావి

విజయవాడ కల్చరల్: రంగస్థల నటుడు ఆచంట వెంకటరత్నం నాయుడు సేవలను ఆదర్శంగా తీసుకోవాలని జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు తెలిపారు. నాటక రంగస్థల ప్రముఖుల సమక్షంలో రంగస్థల నటుడు ఆచంట వెంకటరత్నం నాయుడు 9 వ వర్ధంతి సభను తుమ్మలపల్లి వారి క్షేత్రంలో ఆచంట విగ్రహం వద్ద సోమవారం నిర్వహించారు. గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ పద్యనాటకంలో ఆయన చేసిన ప్రయోగాలు మరెవరూ చేయలేదన్నారు. రావి వెంకట్ మాట్లాడుతూ ఆయనలోని ప్రతిభను గుర్తించి ప్రభుత్వం ఆయనకు పలు అవార్డులు ప్రదానం చేసినట్లు తెలిపారు. పద్యనాటకం పేరు చెబితే ముందుగా గుర్తుకు వచ్చేది వెంకటరత్నం నాయుడు అని తెలిపారు. ఆచంట బాలాజీ నాయుడు, ఐక్యకాపునాడు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేతు రామ్మోనరావు, అంబటి మధుమోహన కృష్ణ, కంది గంగాధర్, బొజ్జా శంకర్, పెన్నేరు దామోదర్, చివుకుల హరగోపాల్ పాల్గొన్నారు. రంగస్థల ప్రముఖులను నిర్వాహకులు సత్కరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ :
90102 10386
Office mail : sakshiads@gmail.com